సాక్షి కర్నూలు

ఆదివారం । 31 । ఆగస్టు । 2025



చట్టాలపై అవగాహన

చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ప్రధాన కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి లీలా వెంకట శేషాద్రి అన్నారు. 8లో▸



నృత్య ప్రదర్శన

శ్రీశైలం టెంపుల్: ధర్మపథంలో భాగంగా శనివారం నిత్య కళావేదికపై హైదరాబాద్‌కు చెందిన దీక్షిత్ అకాడమీ ఆఫ్ డాన్స్ వారి కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,625.54
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:78.272
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:47,211
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:64,566

న్యూస్‌రీల్

‘ఉపాధి’ నిధులతో మ్యాజిక్ డ్రైన్‌లు

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో మ్యాజిక్ డ్రైన్‌లు నిర్మించనున్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద నియోజకవర్గంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి 100 శాతం మ్యాజిక్ డ్రైన్‌లు నిర్మించేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ చర్యలు చేపట్టింది. ఇప్పటి వరకు సీసీ రోడ్లు వేస్తున్నారే కానీ డ్రైన్‌లు నిర్మించలేదు. ఇప్పుడు సీసీ రోడ్డు పక్కనే మ్యాజిక్ డ్రైన్‌లు నిర్మించనున్నారు. మంత్రాలయం నియోజకవర్గం కోసిగి మండలంలో బెలగల్, సజ్జలగూడెం, ఎమ్మిగనూరు నియోజకవర్గం నందవరం మండలంలో కనకవీడుపేట, ఆలూరు నియోజకవర్గం హాలహర్వి మండలంలో సిద్దాపురం గ్రామాలను ఇందుకోసం ఎంపిక చేశారు. పత్తికొండ, కోడుమూరు నియోజకవర్గాల్లో గ్రామాలను ఎంపిక చేయాల్సి ఉంది.

రేపు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవాలని సూచించారు. కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌తో పాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100కు ఫోన్ చేయవచ్చన్నారు. meekosam.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో కూడా అర్జీలను నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

పోలింగ్ బూత్ ఏజెంట్లను నియమించుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): పోలింగ్ బూత్ ఏజెంట్లను రాజకీయ పార్టీలు త్వరగా నియమించుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా సూచించారు. కలెక్టరేట్‌లోని తన చాంబరులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో శనివారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేంద్ర ఎన్నికల కమిషన్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు సమాయత్తం అవుతోందన్నారు. బూత్‌ల వారీగా ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. ఇప్పటికే ఎస్ఐఆర్ బూత్ లెవల్ ఆఫీసర్లు(బీఎల్ఓ)లకు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో 2,203 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ప్రతి 1,200 మంది ఓటర్లకు ఒక్క పోలింగ్ కేంద్రం ఉండాలనే నిబంధనతో కొత్తగా 237 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, బీఎస్పీ నుంచి ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి అరుణ్‌కుమార్, టీడీపీ నుంచి ఆ పార్టీ నేత ఎల్‌వీ ప్రసాదు, కాంగ్రెస్ తరఫున బజారన్న, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు.

జిల్లా భూగర్భ జలవనరుల శాఖ డీడీగా సన్నన్న

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా భూగర్భ జలవనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా కె.సన్నన్నను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం డీడీగా విధులు నిర్వహిస్తున్న ఎం.శ్రీనివాసరావు ఈ నెల 31న పదవీ విరమణ చేస్తున్నారు. ఖాళీ అవుతున్న ఈ పోస్టులో నంద్యాల ఎస్ఆర్‌బీసీ గ్రౌండ్ వాటర్ డీడీగా విధులు నిర్వహిస్తున్న కె.సనన్న నియమితులయ్యారు. ఈయన ఉమ్మడి జిల్లాలోని కొలిమిగుండ్ల మండలానికి చెందిన వారు. ఈయన ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

డీఏఓకు ఆత్మ పీడీగా అదనపు బాధ్యతలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మికి జిల్లా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ప్రాజెక్టు డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ వ్యవసాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతవరకు రత్నప్రసాద్ ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఆన్‌డ్యూటీపై విధులు నిర్వహించారు. ఒరిజినల్‌గా ఒంగోలులో పనిచేస్తున్నారు. ఈయన ఈ నెల 31న పదవీ విరమణ చేయనుండటంతో ఈ నెల 29న ఆత్మ పీడీ బాధ్యతల నుంచి రిలీవ్ అయి ఒంగోలుకు వెళ్లారు. ఖాళీ అయిన ఆత్మ పీడీ పోస్టులో పూర్తి అదనపు బాధ్యతలతో జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి నియమితులయ్యారు.

కోయకనే కన్నీళ్లు!



మెరుగుపడని ధర

మార్కెట్‌కు శనివారం కేవలం 38 మంది రైతులు 1,289 క్వింటాళ్ల ఉల్లిగడ్డలు తెచ్చారు. కనిష్ట ధర రూ.510, సగటు ధర రూ.825 గరిష్ట ధర రూ.1200 నమోదైంది. గరిష్ట ధర ఒకటి రెండు లాట్లకు మాత్రమే దక్కడం గమనార్హం. అతి తక్కువగా వచ్చిన ఉల్లిని కూడా నాణ్యత బాగోలేదని కొనకపోవడం చూస్తే రైతుల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది.

కోడుమూరు రూరల్/సి.బెళగల్: ఈ ఏడాది ఉల్లి సాగు చేసిన రైతులందరికీ నష్టాలు తప్పడంలేదు. పెట్టుబడిలో 70–80 శాతం నష్టపోతున్నారంటే రైతుల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది. ఎకరాకు ఉల్లి సాగులో పెట్టుబడి వ్యయం రూ.లక్ష వరకు వస్తోంది. దిగుబడి కనిష్టంగా 30 క్వింటాళ్లు, గరిష్టంగా 65 క్వింటాళ్ల వరకు ఉంటోంది. ప్రస్తుతం మార్కెట్‌లో ఒకటి, రెండు లాట్లకు రూ.1000–1100 ధర లభించినప్పటికీ 90 శాతం మంది రైతులకు రూ.500 నుంచి రూ.800 వరకు మాత్రమే ధర లభిస్తోంది. ఈ ధరలతో ఉల్లి అమ్ముకోవడం ద్వారా పెట్టిన పెట్టుబడిలో 40 శాతం కూడా దక్కని పరిస్థితి. గత రెండేళ్ల నుంచి దిగుబడులున్నా గిట్టుబాటు ధర లేకపోవడంతో ఉల్లి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది జిల్లాలో సుమారుకు 30వేలకు పైగా ఎకరాల్లో రైతులు వర్షాధారంగా, బోరుబావుల కింద ఉల్లి పంటను సాగు చేయగా,



బురాన్‌దొడ్డి రోడ్డులో పొలంలోనే కుళ్లిన ఉల్లిపంట

కోడుమూరు నియోజకవర్గంలో 9,621ఎకరాల్లో రైతులు ఉల్లి సాగయింది. ప్రస్తుతం బోరు బావుల కింద సాగు చేసిన ఉల్లి పంట చేతికొచ్చింది. అయితే మార్కెట్‌లో ధర లేక రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. మండలంలోని వర్కూరు గ్రామంలో బోరు బావుల కింద చేతికొచ్చిన ఉల్లి పంటను పీకిన సుమారు పదిమంది రైతులు గత 20రోజులుగా పొలాల్లోనే వదిలేసుకున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఉల్లిగడ్డలు కుళ్లిపోతుండటం గమనార్హం.

కోసిగిలో ఉల్లిపంట దిబ్బపాలు

కోసిగి: గిట్టుబాటు ధర లేక ఉల్లి పంట రైతులకు కన్నీరు మిగులుస్తోంది. శనివారం కోసిగికి చెందిన జక్కనగేని పెద్ద ఈరన్న , చిన్న ఈరన్న, కేశవులు, తిరుమల అనే రైతులు ఉల్లి పంటను ఆరుబయట దిబ్బలో పడేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మార్కెట్‌లో క్వింటా ఉల్లి ధర రూ.300 నుంచి రూ.600 కూడా పలకడం లేదన్నారు. ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడితో సాగు చేసుకున్నా కనీసం కూలీల ఖర్చులకు కూడా రావడం లేదని వాపోయారు. ఇటీవల ఆకాల వర్షంతో పంట పూర్తిగా దెబ్బతినిందన్నారు. ఉల్లి కోయడానికి ఖర్చు అవుతోందని, చేసేది లేక దిబ్బలో పడేశామన్నారు.



ట్రాక్టర్‌లో తీసుకొచ్చి బయట పడేస్తున్న దృశ్యం



కుళ్లిపోయిన పంటను చూపుతున్న రైతు పెద్ద ఈరన్న

ఉల్లి సాగుతో అప్పులపాలు



మాకున్న ఎకర పొలంలో ఉల్లి పంట సాగు చేశాం. నార కొనుగోలుకు రూ.11వేలు, పొలాన్ని సిద్ధం చేసుకునేందుకు రూ.12వేలు.. నారు నాటేందుకు కూలీలకు రూ.12వేలు.. ఎరువులకు రూ.13వేలు, పొలంలో ఆరు సార్లు పురుగుమందుల పిచికారీకి రూ.10వేలు, పంట కోతకు రూ.15వేలు, హమాలీ ఇతర ఖర్చులు రూ.5వేల వరకు ఖర్చయింది. పొలంలో కుటుంబ సభ్యులు చేసిన పని లెక్కిస్తే మరో రూ.25వేలకు వరకు అవుతుంది. మొత్తంగా లక్ష రూపాయలకు పైనే పెట్టుబడి పెట్టాం. ఎకరాకు 120 బస్తాల ఉల్లి దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో బస్తా రూ.200 చొప్పున కొన్నారు. మొత్తం రూ.24వేలు చేతికొచ్చింది. ఈ లెక్కన రూ.80వేలకు పైగానే నష్టం. చేసిన అప్పులు ఎలా తీర్చాలో దిక్కుతోచడం లేదు.

– బోయ రామాంజనేయులు, మారందొడ్డి, ఉల్లి రైతు

ధర లేక పొలంలోనే వదిలేశా



బోరు కింద రెండెకరాల్లో రూ.లక్షన్నర ఖర్చు పెట్టుబడితో ఉల్లి పంట సాగు చేశా. పంట చేతికొచ్చినప్పటి నుంచి మార్కెట్లో ధర లేకుండా పోవడంతో ఉల్లి గడ్డలను కోయకుండా గత 20 రోజుల నుంచి పొలంలోనే వదిలేశా. ఇప్పుడు పొలంలో ఉన్న ఉల్లి గడ్డలను కోసి మార్కెట్‌కు తరలించాలన్న సుమారు రూ.50వేలకు పైగా ఖర్చు వస్తుంది. మార్కెట్‌లో క్వింటా ఉల్లి రూ.500 నుంచి రూ.600 మించి పలకడంలేదు. ఏమి చేయాలో పాలుపోక ఉల్లిగడ్డలను పొలంలో వదిలేసుకున్నా.

– రైతు వెంకటప్ప, వర్కూరు గ్రామం, కోడుమూరు మండలం

టీడీపీ నేతల అ‘ధన’పు వసూళ్లు

- ప్రతి నెలా ఇన్‌చార్జి డీలర్‌షిప్‌లలో మార్పులు
- ఒక్కో ఇన్‌చార్జి డీలర్‌షిప్‌నకు రూ.50 వేల వరకు వసూలు



కర్నూలు(సెంట్రల్): పౌర సరఫరాల శాఖలో టీడీపీ నాయకుల అ‘ధన’పు వసూళ్లు ఎక్కువయ్యాయి. ప్రతి నెలా ఖాళీగా ఉన్న డిలర్‌షిప్‌ల స్థానంలో ఇన్‌చార్జ్‌ల కోసం సిఫార్సులు చేస్తుండడంతో అధికారులు ఏమి చేయలేకపోతున్నారు. జిల్లాలో 201 డీలర్‌షిప్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆయా స్థానాల్లో ఇన్‌చార్జ్‌లను టీడీపీ నేతలు రెండు, మూడునెలలకు ఒక్కసారి మారుస్తున్నారు. జిల్లాలోని కర్నూలు డివిజన్‌లో 76, ఆదోని డివిజన్‌లో 80, పత్తికొండ డివిజన్‌లో 45 డీలర్ పోస్టులలు ఖాళీగా ఉన్నాయి. ఈ క్రమంలో ఖాళీ పోస్టుల్లో ఇన్‌చార్జిలను నియమించుకొని పచ్చనేతలు పబ్బం గడుపుకుంటున్నారు. ఒక్కో ఇన్‌చార్జి కోసం రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు. కర్నూలు నగరంలో అయితే ఆ వసూలు మరింత ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పి టీడీపీ చోటామోటా నేతలు వసూలు చేస్తున్నారు. కొన్ని చోట్లా నేరుగా ప్రజాప్రతినిధులే వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

కర్నూలు, ఆదోనిలో భలే డిమాండ్

ఇన్‌చార్జ్ డీలర్‌షిప్‌లకు కర్నూలు, ఆదోనిలలో ఎక్కువగా డిమాండ్ ఉంది. అక్కడ నేరుగా వినియోగదారులకు కేజీకి రూ.10–12 ఇచ్చి తంబ్ వేయించుకొని దోపిడీ చేసేందుకు ఎక్కువగా అవకాశం ఉంది. ఆయా ప్రాంతాల్లో ఎక్కువగా ఉద్యోగులు, వ్యాపారులు, ఇతర పనులు చేసే వారు అధికంగా ఉంటుండడంతో వారు బియ్యం తీసుకోరు. డీలర్లే నేరుగా వినియోగదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి అమ్మకాలు చేసుకుంటూ ఉంటారు. దీంతో ఆ రెండు ప్రాంతాల్లో ఎక్కువగా రేషన్ డీలర్ల ఇన్‌చార్జ్‌లకు డిమాండ్ ఉన్నట్లు తెలుస్తోంది.

డీలర్‌షిప్‌ల ప్రక్రియను అర్ధాంతరంగా నిలిపివేసిన ప్రభుత్వం

జిల్లాలో 201 డీలర్ పోస్టులను శాశ్వత ప్రతిపాదికన భర్తీ చేసేందుకు అధికార యంత్రాంగం 2024 డిసెంబర్ 23వ తేదీన నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. కర్నూలు డివిజన్‌లో 76, ఆదోని డివిజన్‌లో 80,పత్తికొండ డివిజన్‌లో 45 డీలర్ పోస్టుల భర్తీకి లైన్ క్లియర్ చేశారు. 2024 డిసెంబర్ 23 నుంచి డిసెంబర్ 30వ తేదీ వరకు డీలర్ పోస్టుల కోసం దరఖాస్తులను ఆహ్వానించారు. మొత్తం 1,648 దరఖాస్తులు రాగా అందులో కర్నూలు డివిజన్‌లో 874, ఆదోని డివిజన్‌లో 512, పత్తికొండడివిజన్‌లో 262మంది దరఖాస్తు చేసుకున్నారు. 2025 జనవరి 5వ తేదీన డివిజన్ కేంద్రాల్లో రాత పరీక్షను నిర్వహించారు. రాత పరీక్షకు 80 మార్కులు, ఇంటర్వ్యూకు 20 మార్కులు కేటాయించారు. ఒకటి, రెండు రోజుల్లో ఫలితాలు విడుదల చేసి భర్తీ చేస్తారనున్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రక్రియను నిలిపివేసింది. దీంతో అప్పటి నుంచి పరీక్ష రాసిన అభ్యర్థులు ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. కాగా, డీలర్‌షిప్ పోస్టుల భర్తీ ప్రక్రియను ఎందుకు నిలిపివేశారో ఇప్పటికీ ఎవరికీ అర్థం కావడంలేదు.

లాటరీ ద్వారా 19 బార్లు కేటాయింపు



లక్కీ డిప్ విజేతలను ప్రకటిస్తున్న జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య

ఏడు బార్లకు ముందుకు రాని ఆశావహులు

- పెండింగ్ బార్లకు రీ నోటిఫికేషన్
- రేపటి నుంచి అందుబాటులోకి కొత్త బార్లు

కర్నూలు: ఒక్కొక్క బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు తగ్గకుండా వచ్చిన వాటికి మాత్రమే లాటరీ తీసి ఎక్సైజ్ అధికారులు లైసెన్స్‌దారులను ఎంపిక చేశారు. నూతన మద్యం పాలసీ పేరుతో జిల్లాలో బార్ల నిర్వహణకు నోటిఫికేషన్ ఇచ్చిన ఎక్సైజ్ అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా జిల్లాలో 7 బార్లకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. మొత్తం 26 బార్ల ఏర్పాటుకు ఎక్సైజ్ శాఖ దరఖాస్తులను ఆహ్వానించింది. ఇందులో నాలుగేసి దరఖాస్తులు 16 బార్లకు వచ్చాయి. గీత కులాలకు రిజర్వు చేసిన మూడు బార్లకు 19 దరఖాస్తులు వచ్చాయి. ఎక్సైజ్ నోడల్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి పర్యవేక్షణలో శనివారం జిల్లాపరిషత్ సమావేశ భవనంలో మద్యం బార్ల అనుమతులకు లక్కీడిప్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య లాటరీ తీసి బార్లను కేటాయించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ప్రక్రియ కేవలం గంటన్నర వ్యవధిలోనే ముగిసింది. కర్నూలులో 4, ఎమ్మిగనూరులో 2, గూడూరులో ఒక బార్ ఏర్పాటుకు ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. 19 బార్లకు 83 దరఖాస్తులు రాగా వాటికి మాత్రమే లక్కీ డిప్ నిర్వహించారు. దరఖాస్తుల ద్వారా రూ.4.15 కోట్లు ప్రభుత్వానికి ఆదాయం సమకూరింది. పెండింగ్ బార్లకు రీ నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

గీత కులాలకు మూడు బార్లు

పది శాతం రిజర్వేషన్ కింద గీత కులాలకు కర్నూలులో రెండు, ఆదోనిలో ఒకటి చొప్పున మొత్తం మూడు బార్లు అదనంగా ప్రభుత్వం కేటాయించింది. వీటికి మొత్తం 19 దరఖాస్తులు వచ్చాయి. వాటికి కూడా లాటరీ తీసి విజేతలను ప్రకటించారు. అలాగే కర్నూలులో ఆస్పరి రజిత, ఆదోనిలో ఎల్లాల లలితమ్మ లక్కీడిప్‌లో బార్లను దక్కించుకున్నారు. లైసెన్స్ దక్కించుకున్న వారు నిర్దేశిత ఫీజులో ఒక వాయిదా నగదు చెల్లించి ఎక్సైజ్ అధికారుల చేతుల మీదుగా ప్రొవిజినల్ పత్రాలు పొందారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి కొత్త బార్లు అందుబాటులోకి రానున్నాయి. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణా రెడ్డి, సీఐలు చంద్రహాస్, రాజేంద్రప్రసాద్, జాన్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ మెరిట్‌పై తొలగని అనుమానాలు

- డీఈఓ ఆఫీస్‌లో 70 మంది ఫిర్యాదు
- 56 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు కరువు

కర్నూలు సిటీ: ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు చాలా మంది అభ్యర్థులకు ఆందోళనకు గురి చేస్తోంది. మెరిట్ జాబితాలు విడుదల చేసిన సమయంలో మంచి మార్కులు రావడంతో ఉద్యోగం వస్తుందని సంబరపడ్డారు. కానీ కూటమి ప్రభుత్వం గతంలో ఎప్పుడూ లేని విధంగా సరికొత్త విధానాలతో చేపడుతున్న డీఎస్సీ ప్రక్రియ ఎంతో మంది నిరుద్యోగుల పాలిట శాపంగా మారింది. డీఎస్సీ మెరిట్ జాబితాల్లో తమ కంటే తక్కువ మార్కులు వచ్చిన వారికి కాల్ లెటర్లు రావడం...ఒకే క్యాటగిరీ రోస్టర్‌లో ఉన్న వారికి ఇలా జరుగడంతో ఎంతో అభ్యర్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. రెండు రోజుల పాటు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరిగినా తమకు కాల్ లెటర్ రాకపోవడంతో అభ్యర్థులు ఫిర్యాదులు చేసేందుకు డీఈఓ ఆఫీస్ చుట్టూ తిరుగుతున్నారు. డీఈఓ కార్యాలయ సిబ్బంది వారితో రాత పూర్వకంగా ఫిర్యాదు రాయించుకుని పాఠశాల విద్య ఉన్నతాధికారులకు పంపుతున్నారు. శుక్రవారం రాత్రి 23 మంది, శనివారం 46 మందికిపైగా ఫిర్యాదులు ఇచ్చారు. వారిలో అర్హులు ఎవరైనా ఉంటే అలాంటి వారికి సోమవారం కాల్ లెటర్లు రావొచ్చునని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. రెండు, మూడు, నాలుగు పోస్టులు సాధించిన వారి వివరాలు పక్కాగా తెలిన తరువాత 12 నుంచి 21 మందికి కాల్ లెటర్లు వచ్చేందుకు అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఉద్యోగం మాకొద్దు..

ఉమ్మడి జిల్లాలో పాఠశాల విద్యలో మొత్తం 2,645, ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలో 33 పోస్టులు మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తున్నారు. ఈ పోస్టులకు మొత్తం 39,970 మంది అభ్యర్థులు 73 వేలకుపైగా దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఆయా క్యాటగిరీ పోస్టుల్లో అత్యధిక మార్కులు సాధించిన వారిలో 27, 28 తేదిల్లో 2,525 మందికి కాల్ లెటర్లు వచ్చాయి. ఈ నెల 28, 29 తేదీల్లో 2,509 మంది సర్టిఫికెట్లను పరిశీలించారు. గైర్హాజరైన 12 మంది అభ్యర్థుల్లో నలుగురి సర్టిఫికెట్లు శనివారం పరిశీలించారు. ఉద్యోగాలు ఖరారు అనుకున్న ఎనిమిది మంది ఇప్పటికే వివిధ శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగాలుగా చేస్తున్నామని, తమకు టీచర్ ఉద్యోగాలు వద్దు అని ఓటీపీ ద్వారా తెలిపారు. అర్హత లేని కారణంగా మరో నలుగురు రిజెక్ట్ అయ్యాయి. వివిధ విభాగాలకు చెందిన 64 మంది దివ్యాంగులకు వైకల్య పరీక్షలను మరోసారి కర్నూలు ప్రభుత్వ జనరల్ హాస్పటల్‌లో వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో ముగ్గురు మినహా శ్రీకాకుళం నుంచి, పార్వతీపురం నుంచి ఇద్దరు అభ్యర్థులు వైద్య పరీక్షలకు హాజరుకావాల్సి ఉంది. మరో అభ్యర్థి పేరాలసిస్ రావడంతో వైద్య పరీక్షలకు హాజరు కాలేదు. ఉమ్మడి జిల్లాలోని వివిధ క్యాడర్‌లలో 56 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు లేరని విద్యాశాఖ అధికారుల గణాంకాలు చెబుతున్నాయి.

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్లు రీ వెరిఫికేషన్



అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న ఆర్థోపెడిక్ వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన దివ్యాంగ అభ్యర్థుల సర్టిఫికెట్లను శనివారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రీ వెరిఫికేషన్ చేశారు. రీ వెరిఫికేషన్‌కు వైఎస్ఆర్ కడప జిల్లా నుంచి ఈఎన్‌టీ విభాగానికి 13 దరఖాస్తులు రాగా అందులో ఐదుగురు గైర్హాజరయ్యారు. అనంతపురం నుంచి ఆరుగురు హాజరు కాగా, కర్నూలు జిల్లా నుంచి 20 మందిలో ఇద్దరు గైర్హాజరయ్యారు. అలాగే ఆర్థోపెడిక్ విభాగంలో కర్నూలు జిల్లా నుంచి 28 మంది హాజరయ్యారు. సైకియాట్రి విభాగంలో కర్నూలు నుంచి ఒకరు, అనంతపురం జిల్లా నుంచి నలుగురు హాజరయ్యారు. కంటి ఆసుపత్రిలోనూ పలువురు అభ్యర్థుల సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్‌లో భాగంగా వైద్యులు పరీక్షించారు. ఈ ప్రక్రియను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

కూటమి ప్రభుత్వం అన్నింటా విఫలం



వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శశికళ

ఆలూరు: కూటమి ప్రభుత్వం అన్నింటా విఫలమైందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కురుబ శశికళ విమర్శించారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సును ప్రవేశపెట్టిన ప్రభుత్వం అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేయకపోవడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సెప్టెంబర్ 1న ఉదయం 10 గంటలకు కర్నూలు ఎస్వీ కాన్వెన్షన్ హాల్లో రాష్ట మహిళా అధ్యక్షురాలు వరుదు కళ్యాణి, రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రసిడెంట్ ఎస్వీ విజయ మనోహరి ఆధ్వర్యంలో జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం కార్యకర్తల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి అన్ని నియోజకవర్గాల నుంచి మహిళా ప్రజా ప్రతినిధులు, పార్టీ పదవులు పొందిన వారు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ఏడు మండలాల్లో తేలికపాటి వానలు

కర్నూలు(అగ్రికల్చర్): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలోని వివిధ మండలాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు ఏడు మండలాల్లో వర్షపాతం నమోదైంది. దేవనకొండలో 9.4 మి.మీ, నందవరంలో 7.8, కోసిగిలో 6.8, ఎమ్మిగనూరులో 4.2, సి.బెళగల్‌లో 2.6, గోనెగండ్లలో 2.2 , మంత్రాలయంలో 1.6 మి.మీ ప్రకా రం వర్షాలు కురిశాయి. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 116.2 మి.మీ ఉండగా.. 205.8 మి.మీ నమోదైంది. రానున్న మూడు రోజుల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు.

క్లుప్తంగా

సమస్యలు తలెత్తితే నేరుగా కలవండి

- పదవీ విరమణ ఉద్యోగులకు ఎస్పీ హామీ



పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను సత్కరిస్తున్న ఎస్పీ

కర్నూలు: పదవీ విరమణ అనంతరం రావాల్సిన ప్రయోజనాలకు సంబంధించిన సమస్యలు ఏవైనా తలెత్తితే తనను నేరుగా కలవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. కర్నూలు పీసీఆర్ ఎస్ఐ నిర్మలాదేవి, ఏఆర్ ఎస్ఐ పురుషోత్తం తదితరులు పోలీసు శాఖలో సుదీర్ఘకాలం పనిచేసి పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా పోలీసు శాఖ తరపున ఎస్పీ విక్రాంత్ పాటిల్ శాలువా కప్పి పూలమాలలతో సత్కరించి వీడ్కోలు పలికారు. శేష జీవితం కుటుంబాలతో సంతోషంగా గడపాలని సూచించారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, ఏఆర్ డీఎస్పీ భాస్కర్‌రావు, ఎస్‌బీ సీఐ కేశవ రెడ్డి, ఆర్ఐ నారాయణ, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు నాగరాజు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

'శుభప్రద' బాధితులకు పరిహారం చెల్లించాల్సిందే

కర్నూలు: నగర శివారులోని శుభప్రద వెంచర్‌లో ప్లాట్లు కొని నష్టపోయిన 29 మంది కొనుగోలుదారులకు రూ.57.40 లక్షలు చెల్లించాల్సిందేనంటూ జిల్లా వినియోగదారుల కమిషన్ ప్రెసిడెంట్ కరణం కిషోర్ కుమార్, సభ్యులు ఎస్.నారాయణ రెడ్డి, నజీమా కౌసర్ తీర్పు వెల్లడించారు. ఫిర్యాది పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. శుభప్రద వెంచర్ వారు 2020 జూన్‌లో కల్లూరుకు చెందిన సర్వే నెంబర్లు 37, 38, 49లలో వెంచర్ వేశారు. అందులో తుగ్గలి మండలం ఆర్‌ఎస్ పెండేకల్లు గ్రామానికి చెందిన ఫిర్యాదుదారు దూదేకుల హుసేన్‌బీతో పాటు మరో 28 మంది ఒక్కొక్క ప్లాటు రూ.4.80 లక్షలకు కొనుగోలు చేశారు. అయితే నిర్వాహకుడు వెంచర్ వేయక ముందే 2020 ఫిబ్రవరిలోనే నేషనల్ హైవే వారు ఆ వెంచర్ మీదుగా చెన్నై–సూరత్ గ్రీన్ హైవే వెళ్తుందని భూసేకరణ కోసం ప్రకటన ఇచ్చారు. భూసేకరణలో భాగంగా ఆ వెంచర్‌లోని 60 ప్లాట్లలో హైవే వెళ్లింది. ప్లాట్లు కొన్నవారికి భూమి కన్వర్షన్ జరగని కారణంగా ప్లాటుకు ప్రభుత్వం కేవలం రూ.2.80 లక్షలు మాత్రమే చెల్లించింది. వెంచర్ మీదుగా హైవే వెళ్తున్న విషయాన్ని దాచిపెట్టి ప్లాట్లు విక్రయించడం మూలంగా నష్టపోయామంటూ న్యాయం కోసం బాధితులు జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కారం కమిషన్‌ను ఆశ్రయించారు. ఫిర్యాదిని విచారించిన కమిషన్ ఈ వ్యవహారంలో వెంచర్ నిర్వాహకుల సేవా లోపంతో పాటు అక్రమ వాణిజ్యానికి పాల్పడినట్లు భావించి ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున నష్టపరిహార చెల్లించాలని ఆదేశించింది. కోర్టు ఖర్చుల కింద ఒక్కొక్కరికి రూ.5 వేలు వెంచర్ యాజమాన్యం తీర్పు వెలువడిన 45 రోజుల లోపు చెల్లించాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది.

డీఎంఈగా డాక్టర్ రఘునందన్



కర్నూలు(హాస్పిటల్): డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ)గా కర్నూలుకు చెందిన డాక్టర్ జి.రఘునందన్ నియమితులయ్యారు. అనంతపురం జిల్లా గుత్తికి చెందిన ఆయన ఎంబీబీఎస్, ఎంఎస్ ఆర్థోపెడిక్ పీజీలను తిరుపతిలోని స్విమ్స్‌లో చదివారు. అనంతరం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కర్నూలు మెడికల్ కాలేజిలో చేరారు. ఇక్కడే అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్, హెచ్‌ఓడీగా విధులు నిర్వహించారు. 2022తో ఆయన అడిషనల్ డీఎంఈగా పదోన్నతి పొందారు. రెండు నెలల పాటు అనంతపురం మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్‌గా పనిచేసిన అనంతరం అకడమిక్ డీఎంఈగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన కర్నూలులోనే నివాసముంటున్నారు. డీఎంఈగా నియమితులు కావడం పట్ల కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వైద్యులు హర్షం వ్యక్తం చేశారు.

వివాహిత ఆత్మహత్య

దేవనకొండ: భర్త వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లెడబుడకల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వడ్ల బాలకృష్ణకు జాలవాడి గ్రామం పెద్దకడబూరు మండలానికి చెందిన వడ్డే పద్మతో తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి సంతానం కలుగలేదు. అయితే సంతాన విషయంలో నిత్యం భర్త వేధిస్తుండడంతో జీవితంపై విరక్తి చెందిన పద్మ శుక్రవారం కరివేముల నుంచి జిల్లెడబుడకలకు వెళ్లే దారిలో ఉన్న పొలంలో రసాయన ద్రావణం తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. బంధువులు గమనించి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతిచెందింది. మృతురాలి సోదరుడు గురప్పచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వంశీనాథ్ తెలిపారు.





అధికార పార్టీ కాంట్రాక్టర్.. అడిగేదెవరు!

- కుంగిన రోడ్డులో ఇరుక్కున్న లారీ

రోడ్లను మెరిపిస్తామని చెప్పిన కూటమి నేతల మాటలకు అడుగడుగునా తూట్లు పడుతున్నాయి. గొప్పలు చెప్పుకునేందుకు మరమ్మతులు చేపట్టినా మూన్నాళ్ల ముచ్చటగానే మారింది. ఇదంతా ఒక ఎత్తయితే.. టీడీపీకే చెందిన ఎమ్మెల్యే ఆధ్వర్యంలో చేపట్టిన 340సీ రోడ్డు నిర్మాణ పనులు చూస్తే ఈ ప్రభుత్వానికి రహదారులపై ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతుంది. అధికార పార్టీ కావడంతో అడిగేదెవరు అన్నట్లుగా సాగుతోంది ఈ రోడ్డు నిర్మాణం. నాసిరకం పనుల కారణంగా చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డు ఎక్కడికక్కడ కుంగిపోతోంది. పారుమంచాల చెక్‌పోస్టు సమీపంలో కర్నూలుకు వెళ్తున్న లారీ పారుమంచాల క్రాస్ రోడ్డు వద్ద కుంగిన రోడ్డులో టైర్ ఇరుక్కుపోయింది. దాదాపు సగం టైర్ గుంతలో ఇరుక్కుపోయిన దృశ్యాన్ని చూసి ప్రయాణికులు, డ్రైవర్లు కాంట్రాక్టర్ రోడ్డును ఎంత నాణ్యతగా నిర్మిస్తున్నారోనని చర్చించుకోవడం గమనార్హం.

– జూపాడుబంగ్లా

ఇసుక ట్రాక్టర్ బోల్తా – డ్రైవర్ మృతి



మృతి చెందిన గోగుల సూర్యుడు

సంజామల: పేరుసోముల గ్రామ సమీపంలోని పెద్దమ్మ గుడి వద్ద శనివారం తెల్లవారుజామున ఇసుక ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాల మేరకు...కొలిమిగుండ్ల మండలం బందారపల్లెకు చెందిన గోగుల సూర్యుడు(47) తాడిపత్రి నుంచి ఇసుక ట్రాక్టర్‌తో పేరుసోముల మీదుగా నంద్యాలకు తీసుకెళ్తున్నాడు. పేరుసోముల గ్రామం సమీపంలో ఉన్న పెద్దమ్మ గుడి వద్ద వేగాన్ని అదుపు చేయలేక ట్రాక్టర్ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సూర్యుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తెల్లవారుజామున ఇసుక ట్రాక్టర్ బోల్తాపడిన సంగతిని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతికి ఇద్దరు భార్యలు, ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కుంటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బిల్లేకల్లు మార్కెట్ వేలం రూ.89.40 లక్షలు



బిల్లేకల్లులో దినసరి కూరగాయల మార్కెట్‌కు వేలం నిర్వహిస్తున్న దృశ్యం

ఆస్పరి: మండలంలోని బిల్లేకల్లు దినసరి కూరగాయలు మార్కెట్ వేలం రూ. 89.40 లక్షలు ధర పలికింది. శనివారం సర్పంచ్ శ్రీను ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి అంజినయ్య పంచాయతీ కార్యాలయం అవరణలో 2025–26 సంవత్సరానికి సంబంధించి దినసరి కూరగాయలు మార్కెట్ వేలం నిర్వహించారు. ఈ వేలంలో ఐదుగురు పాటదారులు రూ. 5 లక్షలు సాల్వెన్సీ, రూ. 2 లక్షలు డిపాజిట్ చెల్లించి పాల్గొన్నారు. పోటాపోటీగా వేలం సాగింది. చివరకు బాట తిక్కయ్య అనే వ్యక్తి రూ.89.40 లక్షలు ఎక్కువ ధర వేలం పాడి మార్కెట్ హక్కులు దక్కించుకున్నారు. గత ఏడాది రూ. 65 లక్షలు పలకగా, ఈసారి రూ. 89.40 లక్షలు పలకడంతో రూ. 29.40 లక్షలు పంచాయతీకి ఆదాయం వచ్చింది. వేలం నిర్వహణలో ఎంపీడీఓ గీతావాణి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆస్పరి సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు చేపట్టారు.

ఫారెస్ట్ చెక్‌పోస్టు మార్పు

- సెల్ సిగ్నల్ అందే చోట ఏర్పాటు



నూతనంగా ఏర్పాటు చేస్తున్న చెక్ పోస్టు

శిరివెళ్ల: నంద్యాల– ఒంగోలు రహదారిపై పచ్చర్ల సమీపంలో ఉన్న ఫారెస్ట్ చెక్ పోస్టును అదే దారిలో మరో చోట ఏర్పాటు చేస్తున్నారు. అటవీ సంపద అక్రమ రవాణా అడ్డుకట్టకు 2019లో అటవీ అధికారులు పచ్చర్ల సమీపంలో ఈ చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. అయితే అక్కడ సెల్ సిగ్నల్ అందకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాలు అందడంలో జాప్యం జరిగేది. అలాగే ఫాస్టాగ్ సదుపాయానికి అటంకం ఏర్పడింది. దీంతో అధికారులు సిగ్నల్స్ ఉన్న సర్వ నరసింహస్వామి ఆలయ సమీపంలో గాజులపల్లె వైపు చెక్ పోస్టు ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. సెప్టెంబర్ మొదటి వారంలో చెక్ పోస్టు ప్రారంభించనున్నారు.

చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలి

- జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ప్రధాన కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ప్రధాన కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి



హాజరైన వివిధ శాఖల అధికారులు, మహిళా సిబ్బంది

ఓర్వకల్లు: చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ప్రధాన కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి లీలా వెంకట శేషాద్రి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ది ఆదేశాల మేరకు శనివారం స్థానిక పొదుపు భవనంలో 'న్యూ మాడ్యూల్ లీగల్ సర్వీసెస్' శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్జి లీలా వెంకట శేషాద్రితో పాటు, జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు ఆఫీసర్ పి.నిర్మల, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బి.రాధిక, గిరిజన సంక్షేమ శాఖ అసిస్టెంట్ ట్రైబల్ ఆఫీసర్ హుసేనయ్య, సీనియర్ న్యాయవాది వై.జయరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ.. సమాజంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలు, అకృత్యాలు, బాల్యవివాహాలు, దళిత, గిరిజనులపై అత్యాచారాలు, కులదూషణలు, దాడులను అరికట్టాలంటే చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బాల్య వివాహాలు జరుగకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. 2015–గిరిజన హక్కుల పరిరక్షణ, అమలు పథకం(నల్సా), నల్సా సంవాద్ అట్టడుగు వర్గాలకు, బలహీన వర్గాలకు చెందిన సంచార తెగలకు న్యాయం పొందే అవకాశాన్ని బలోపేతం చేసే పథకం ద్వారా ఆయా తెగలకు న్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. ఉచిత న్యాయ సహాయం, విద్యాహక్కు చట్టం, హెల్ప్ లైన్ నంబర్ 1098, మహిళ హెల్ప్ లైన్ నంబర్ 181, న్యాయ సహాయం కోసం హెల్ప్ లైన్ నంబర్ 15100, చైల్డ్ లైన్ నంబర్ 1098, దివ్యాంగజన్ హెల్ప్‌లైన్ నంబర్ 14456 తదితర హెల్ప్ లైన్‌లను సంప్రదించాలని వెల్లడించారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో ప్రదర్శించిన స్టాల్స్‌ను వారు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మానసిక వైద్య నిపుణులు డా.సుమంత్, డీఐఓ నాగప్రసాద్, స్థానిక ఎంపీడీఓ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ సతీష్, ఎంఈఓ ఓంకార్ యాదవ్, డీసీడబ్ల్యూఓ శారద, ఐసీడీఎస్ సీడీపీఓ అనురాధ, నన్నూరు పీహెచ్‌సీ వైద్యులు డా. కరుణ, ఏపీఎంలు శ్రీనివాసులు, వెంకటరామిరెడ్డి, పురోహితులు, పాస్టర్లు, ఖాజీలు, వెలుగు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, సచివాలయం మహిళ పోలీసులు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వెళ్తూ..

- ఆటో బోల్తా పడి వృద్ధురాలి మృతి



మృతురాలు శివమ్మ (ఫైల్)

బనగానపల్లె రూరల్: దైవ దర్శనానికి బయలుదేరిన ఓ కుటుంబం రోడ్డు ప్రమాదానికి గురికాగా.. అందులో ఓ వృద్ధురాలు మృత్యువాత పడింది. యాగంటి క్షేత్రం నుంచి కటికవానికుంటకు వెళ్లే దారిలో ఘాట్ రోడ్డుపై శనివారం ఆటో బోల్తా పడి ఓ వృద్ధు రాలి మృతి చెందగా, మరో మహిళకు తీవ్ర గాలయ్యాయి. మృతురాలి కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. వైఎస్సార్ జిల్లా పెద్దముడియం గ్రామానికి చెందిన ఏ శివమ్మ(60), ఆమె కుమారుడు మహేశ్వరరెడ్డితో పాటు 9 మంది కుటుంబ సభ్యులు యాగంటి క్షేత్రం, మద్దిలేటిస్వామి క్షేత్రాన్ని చూసేందుకు శనివారం ఆటోలో వచ్చారు. అయితే యాగంటి సమీపం నుంచి కటికవానికుంట గ్రామ ఘాట్ రోడ్డు మీదుగా మద్దిలేటిస్వామి క్షేత్రానికి ఆటోలో బయల్దేరారు. అయితే యాగంటి సమీపంలో ఎత్తైన ఘాట్ రోడ్డుపై ఎక్కువ మంది ప్రయాణికులతో వెళ్తున్న ఆటో లోడ్ అధికమవ్వడంతో డ్రైవర్ స్టీరింగ్ అదుపు తప్పి ఆటో బోల్తాపడి శివమ్మపై పడింది. తీవ్రంగా గాయపడిన శివమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మరో మహిళ తులశమ్మకు తీవ్ర గాయాలు కాగా పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో వీరిని చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న బనగానపల్లె ఎస్ఐ కల్పన వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానిత ఆంత్రాక్స్ కేసులపై విచారణ



అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్యురాలితో మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని శివన్న నగర్ ప్రాంతంలో ముగ్గురికి ఆంత్రాక్స్ అనుమానిత వ్యాధి లక్షణాలున్నాయన్న సమాచారంతో శనివారం అధికారులు అప్రమత్తమయ్యారు. దీంతో జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యుటీ డైరెక్టర్ పీవీ రమణ, ఏడీ సుబ్రమాణ్యేశ్వర ఆచారి స్థానిక శివన్న నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌కు వచ్చి వైద్యాధికారిణి వీణతో మాట్లాడారు. అర్బన్ హెల్త్ సెంటర్‌కు ఎవరైనా వచ్చి ఆంత్రాక్స్ అనుమానిత లక్షణాలున్న వారు ప్రథమ చికిత్స చేయించుకున్నారా.. అని ఆరా తీయగా.. అలాంటి వారెవరూ చికిత్స చేయించుకోలేదని ఆమె వారికి తెలిపారు. అదేవిధంగా ఏఎన్ఎంలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా ఆంత్రాక్స్ వ్యాధి లక్షణాలతో వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. అంతకుముందు కందనాతి గ్రామంలో గొర్రెలను పరిశీలించారు. ఎమ్మిగనూరులో ఎలాంటి అనుమానిత ఆంత్రాక్స్ కేసులు నమోదు కాలేదని వైద్య సిబ్బంది చెప్పడంతో పశుసంవర్ధక శాఖ అధికారులు ఊపిరి పీల్చుకొన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అదేవిధంగా మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డిని కలిసి మాట్లాడారు. వారి వెంట పశుసంవర్ధక శాఖ వీఏఎస్ డాక్టర్ దినకర్, ఎంపీహెచ్ఈఓ విజయకృష్ణలు పాల్గొన్నారు.

వాగులో పడి యువకుడి మృతి

- మరొకరు సురక్షితం
- మృతుడు ఉత్తరప్రదేశ్ వాసి



మృతి చెందిన లవ్‌కుశ్



ప్రాణాలతో బయటపడిన సాకిబ్

కోవెలకుంట్ల: బతుకు బాటలో ఓ యువకుడు మృత్యుఒడి చేరాడు. వల్లంపాడు గ్రామ సమీపంలో శనివారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బలరాం జిల్లా గొండిపూర్‌కు చెందిన లవ్‌కుశ్(19) అనే యువకుడు అదే రాష్ట్రానికి చెందిన సాకిబ్ అనే మరో యువకుడు కోవెలకుంట్ల మండలం చిన్నకొప్పెర్లలో ఓ ఇంటి పీఓపీ పనుల నిమిత్తం నంద్యాల నుంచి బైక్‌పై బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న రహదారిలో వల్లంపాడు సమీపంలో కుందూనదికి అనుసంధానంగా ఉన్న చిన్న వంచెవాగు వంతెనపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగు ఉధృతిని గమనించకపోగా కొత్త ప్రాంతానికి చెందిన వారు కావడంతో బైక్‌తో వాగు దాటేందుకు ప్రయత్నించారు. సాకిబ్ బైక్‌పై కూర్చోని నడపుతుండగా లవ్‌కుశ్ బైక్‌ను ముందుకు తోస్తున్నాడు. వాగు మధ్యలోకి వచ్చేసరికి ఉధృతి పెరగడంతో నీటి ప్రవాహానికి ఇద్దరూ బైక్ సహా వాగులోపడ్డారు. సాకిబ్ వెంటనే తేరుకుని ఒడ్డుకు చేరుకోగా.. లవ్‌కుశ్‌కు ఈత రాకపోవడంతో వాగు ఉధృతిలో గల్లంతయ్యాడు. గ్రామస్తులు రెవెన్యూ, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, రేవనూరు ఎస్ఐ భూపాలుడు తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. జాలర్ల సాయంతో వాగులో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు కేసు నమోదు చేసి శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఉద్యోగ అవకాశాలు

త్వరలో నంద్యాల రోడ్, **కర్నూలు** లో ప్రారంభం కానున్న నూతన షాపింగ్ మాల్ లో పనిచేయుటకు క్రింద తెలియజేయబడిన పోస్ట్‌లకు ఉత్సాహవంతులైన అభ్యర్థులు **కావలెను.**

ఫ్లోర్ మేనేజర్స్ | సేల్స్ ఎగ్జిక్యూటివ్స్
క్యాషియర్స్ | రిసీవర్స్ | డ్రైవర్స్ | టైలర్స్
సెక్యూరిటీ గార్డ్స్ | హౌస్ కీపింగ్ | హెల్పర్స్

ఆకర్షణీయమైన జీతాలతో పాటు PF, ESI & బోనస్ కలదు

ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ బయోడేటా, 2 ఫోటోలు, ఆధార్ జిరాక్స్ కాపీలతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కాగలరు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ ✆ 92814 13701

Date: 31st Aug & 1st Sep Time: 11:00 AM

దేవి ప్యారడైస్ ఫంక్షన్ హాల్ ప్రక్కన, కర్ణాటక బ్యాంక్ బిల్డింగ్, నంద్యాల రోడ్, కర్నూలు.

కెనరా బ్యాంక్ Canara Bank

ప్రాంతీయ కార్యాలయం : కర్నూలు [illegible] ఫోన్: 08518-259262/279/278/292. సెల్: 94409 06407

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

1) [illegible] 518001.
2) [illegible] 516001.

[illegible] సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.

[illegible]

లోన్ స్వభావం & లోన్ అకౌంట్ నెం.	లోన్ మొత్తం మరియు లోన్ తేది	పత్రికలో తెలిపిన తేది నాటికి బకాయి మొత్తం	వడ్డీ రేటు
HOUSING LOAN A/c. No. 887298800001075	రూ. 1,50,00,000/- తేది: 28.12.2020	రూ. 1,46,44,791.55/-	8.70% P.A

[illegible]

తేది: 30.08.2025, ప్రదేశం: కర్నూలు సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

సాక్షి సండే క్లాసిఫైడ్స్

EDUCATION

■ వెటర్నరీ డిప్లొమా నందు తక్కువ ఫీజులో సీట్లు కలవు. 10th పాస్, ఇంటర్ ఫెయిల్ అయిన వారికి అవకాశం కలదు. ✆ 83744 35245. [SCA25007644]

DISTANCE EDUCATION

■ ఎపి ఓపెన్ స్కూలు వారి 10th లేదా ఇంటర్ ఒకే సంవత్సరంలో పూర్తి మరియు డిగ్రీ, పిజి అడ్మిషన్స్ కొరకు సంప్రదించండి: ✆ 93946 68667. [SCA25007531]

■ **APOSS-SSC & INTER (1Yr)** సీట్లు కలవు. అడ్మిషన్ తీసుకున్న వారికి స్టడీ మెటీరియల్ ఉచితం. శ్రీ సాయి కాలేజ్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, కర్నూలు.7981223882 [L-712]

■ **JIPS PARAMEDICAL COLLEGE KURNOOL:** FEW SEATS AVAILABLE: 10TH PASS: MLT, MPHW (ANM) 12TH PASS:DMLT (LAB TECHNICIAN) ANETHEISA DMST (OT) DMPHA (MALE NURSING FREE SEATS): Cell: 8686172989, 8309352305, 9440716644. [SCA25007674]

REAL ESTATE

■ వేగంగా అభివృద్ధి చెందుతున్న కర్నూలు సిటీలో ప్లాట్లు, భూములు, ఇండ్లు కొనాలన్నా, అమ్మాలన్నా సంప్రదించండి: జె.వై.శాస్త్రి, సెల్: 9676211033. [SCA25007713]

PLOT FOR SALE

■ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నందికొట్కూరు రోడ్డు ఓపెన్ ప్లాట్లు కలవు. ఒక సెంటు కేవలం 3L మాత్రమే. సంప్రదించండి: 8106775586. [SCA25007694]

■ 2 సెంట్ల ఓపెన్ ప్లాటు కేవలం 1 లక్ష మాత్రమే. సంప్ర: సలీం ప్రాపర్టీస్. opp: కరెంట్ ఆఫీస్, నంద్యాల. 7075978579. [SCA25007716]

■ **SITE/BUILDING** opp to gayatri estate. Lakshmi nagar, 2nd bit from main road, suitable for Hospitals & Educational inestitu tions. contact: somisetty venkata ramaiah : 9581470777, somisetty prasad : 9490238661. [L-727]

LAND FOR SALE

■ కర్నూలు జిల్లా, కృష్ణగిరి మండలం పోతుగల్లు గ్రామంలో 8 ఎకరముల ఎర్ర వ్యవసాయ భూమి అమ్మకం, పంటలకు తగిన నీరు కలదు. ఫోన్: 89715 38888 [B-1106]

TO - LET

■ కర్నూలు ఎన్.ఆర్.పేట, రోడ్ నెం.1, మెయిన్ రోడ్డు కార్నర్ షాప్స్ బాడుగకు ఇవ్వబడును. మెడికల్ షాప్స్, డాక్టర్స్‌కు అనుకూలం. సెల్: 93938 93933. [SCA25007388]

■ **Shops/Godowns:** 3 shops, 40 feet road, sri lakshmi commercial complex, opp: 4th Town Police Station, bellary chowrastha, kurnool. 9494559221. [SCA25007529]

FOR SALE

■ **BSNL POSTAL HOUSING** SOCIETY Residential and Commercial Sites near Bengaluru International Airport. Rs:1400/- per sqft Bang on 8 Lane (330 feet Ring road) Booking Open for General public Call: 90715 34000 [QA-2295]

SERVICES

HEALTH CARE

PHYSICIAN

■ డా॥కె.చంద్రమౌళి రెడ్డి, Gen. MED, IDCCM, జనరల్ & ఫిజిషియన్, ఫెలో ఇన్ క్రిటికల్ కేర్ యూనిట్, ప్రతి గురువారం షుగర్ ఫ్రీ చెకప్. శ్రీ సాయిచంద్ర క్లినిక్, గాయత్రి ఎస్టేట్, కర్నూలు. సెల్: 88970 87874. [SCA25007366]

GYNECOLOGY

■ డా॥ కె.అరవింద MBBS, DNB, OBG గర్భిణీ మరియు స్త్రీ వ్యాధి నిపుణురాలు. 2PM To 5PM & 5 PM-9PM. శ్రీ సాయిచంద్ర క్లినిక్, గాయత్రి ఎస్టేట్, కర్నూలు.✆ 88970 87874 [SCA25007368]

WANTED

■ కర్నూలు టౌన్ కేశవ్ గ్రాండ్ (నేషనల్ హైవే 44 సన్య మోటార్స్ పక్కన) లాడ్జ్ నందు పనిచేయుటకు తెలుగు, హిందీ భాష తెలిసిన రూమ్ బాయ్స్ & వాచ్‌మెన్ కావలెను. సంప్రదించండి: 9133396666, 08518-256666. [SCA25007673]

■ **Wanted** an inter-board clerk for Junior College, knl. Cell: 8500780180. [SCA25007696]

■ ప్రముఖ బ్యాంక్ నందు పర్సనల్–బిజినెస్–హోమ్ లోన్స్ మార్కెటింగ్ చేయుటకు టెలీకాలర్స్ (F) & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (F&M) కావలెను. సంప్ర: 9642968786. [SCA25007701]

■ పెట్రోల్ బంక్ నందు పనిచేయుటకు అకౌంటెంట్ విత్ ట్యాలీ & పంపుబాయ్స్ కావలెను. బయోడేటా వాట్సాప్/ కాల్ – 80086 78969 [SCA25006901]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. నోటార్గెట్, జీతం: 10వేల నుండి 15వేలు. సంప్ర: 99850 07058. [SCA25007616]

■ కర్నూలు జిల్లా నందు మైన్స్‌లో పనిచేయుటకు ఫోర్ మెన్ & మేట్స్ కావలెను. ఆసక్తి కలిగిన వారు వివరాలకు సంప్రదించండి: 9160614224, 9885274001. [SCA25007711]

■ శ్రీ శక్తి మ్యాక్స్ Ltd నందు పనిచేయుటకు ఫీల్డ్ స్టాఫ్ కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 15-18K, అడ్రస్: ఐకాన్ షాపి కాంప్లెక్స్, (యూనియన్ బ్యాంక్ కాంప్లెక్స్) 4th ఫ్లోర్, బిర్లా కాంపౌండ్, కర్నూలు. వివరాలకు సంప్రదించండి: 83413 80122, 95027 66466. [SCA25007621]

■ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. ఆఫీస్ అడ్రస్: ఓర్వకల్లు మండలం కాల్వ బుగ్గ శివాలయం టెంపుల్ ప్రక్కన. అర్హత: 10th పాస్. జీతం: 15,220 (26 రోజులు), రూమ్, భోజనం ఫ్రీ. డ్యూటీ టైం: 8 గంటలు. ఇంటర్వ్యూ తేదీ: 31.08.25 సంప్ర: 8897444705, 9703531532. [SCA25007700]

■ కర్నూలు సిటీలో పనిచేయుటకు లేడీ రిసెప్షనిస్ట్/సూపర్‌వైజర్, హౌస్ కీపింగ్ బాయ్స్, రూంబాయ్స్, వెయిటర్స్ మరియు కార్ షోరూమ్స్, స్కూల్స్, హోటల్స్ నందు సెక్యూరిటీ గార్డ్స్ (8గంటలు/12గంటలు) కావలెను. ఆకర్షణీయమైన జీతం. సంప్ర: 8341957788, 9494333443. [SCA25007723]

■ **Wanted EM Teachers** For VI to X Classes to Teach Physics & Telugu. Contact: Sri Adithya School, Kallur, Kurnool. Cell: 94901 30596 [L-725]

■ **Wanted** Experienced JEE/ NEET Faculty for Junior College and School. Cell: 9550590900/ 9290748955. [L-555]

■ **Wanted** Bed social teacher for classes 8, 9, 10 Vijetha Vidyalaya EM High School. Sreerama Nagar, c-camp Kurnool. ✆ 9492717522. [SCA25007554]

■ **Wanted Duty Doctor** : BUMS, BHMS, BAMS, MBBS Dr.Kailash's Clearskin Hair and Laser Centre Vidyanagar, Kurnool. Contact : 9393827032, 8688098177. [SCA25007327]

■ **Wanted** Sales Executives for Hyundai Car Showroom in Kurnool, Nandyal, and Adoni. Contact: 9133314336, 9160114474 (Salary+ Incentives+Allowances). [SCA25007731]

■ **Wanted Faculty Teachers:** Wanted experienced teachers to teach pre primary classes attend interview on Monday I.e 01-09-2025 at 10 am. contact 9246922675. [SCA25007721]

■ ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు ఇంటర్ విద్యార్హత కలిగి 3 to 4 సం॥ల అనుభవం కలిగిన సెక్యూరిటీ బాయ్స్ కావలెను. Cell:77020 11258, 99890 51991. [NA-11357]

■ విజయవాడలో A/C Rental Events కంపెనీకి డ్రైవింగ్ తెలిసిన హెల్పర్స్, A/C టెక్నీషియన్స్ కావలెను. జీతం:20-25,000/- భో+వసతి+ఫ్రీ ట్రైనింగ్. ✆ 99660 44671 [B-1272875]

■ షిరిడీ సాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్, లేడీ కేర్ టేకర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. Ph: 8985114453, 9391036931 [HA-16135]

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ: 15వేలు-40వేలు,ఫ్రీరూమ్+భోజనం.Hyd. 7993583999 [HA-16136]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

